

# మినీ మేడారం జాతర తేదీల ఖరారు

8లో..

- ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జాతర నిర్వహణ
- వెల్లడించిన పూజారులు


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 41
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
అక్టోబర్ 26, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net





# మేమేం తప్పు చేశాం?

- కుటుంబాలకు దూరంగా కానిస్టేబుళ్లు
- కన్నీటిపర్యంతం అవుతున్న కుటుంబ సభ్యులు
- ఉధృతమవుతున్న పోలీస్ ఉద్యమం
- ఏక్ పోలీస్–ఏక్ స్టేట్ విధానం మరిచారా అంటూ ప్రశ్న
- రాష్ట్రంలో తొలిసారి డ్రెస్ వేసుకొని ధర్నా
- మా భార్యలతో అలా ఎలా అంటారంటూ నిలదీత

అందరి పోలీసుల్లాగే తమ భర్తలు కూడా పరీక్ష రాసి, ఫిజికల్ టెస్టుల్లో పాసై, తొమ్మిది నెలలు కఠోర శిక్షణ తీసుకున్నవారే కదా? పొద్దున్నే పార, పలుగు ఇచ్చి ఎందుకు కూలీ పనులు చేపిస్తున్నరు? వాళ్లకెందుకు మిగతా సివిల్, ఏఆర్ పోలీసుల్లాగా ఒకే చోట డ్యూటీలు వేయరు? మా భర్తలు ఏడాదికి మూడు జిల్లాలు తిరగాల్సి వస్తుంది. మేము ఎక్కడ ఉండాలి? మా బిడ్డలు ఎక్కడ చదువుకోవాలి? చేసేది పోలీసు ఉద్యోగమైనా ఈ తిరుగుడేంది? వాళ్లను కట్టుకున్న పాపానికి మేమేం తప్పు చేశాం అంటూ బాధిత బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. పిల్లలు పుట్టి పెద్దవారవుతున్నా తండ్రి ఎవరో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉద్యోగం చేస్తున్న తమ భర్తలను తోటి పోలీసులే జీతగాండ్లలాగా చూస్తున్నారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. దీన్ని ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న కానిస్టేబుళ్ల భార్యలు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఏక్ పోలీస్-ఏక్ స్టేట్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గత మూడు రోజులుగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. సతులకు మద్దతుగా పతులు శనివారం నిరసన చేపట్టారు. అయితే రాష్ట్రంలోనే తొలిసారిగా కానిస్టేబుళ్లు డ్రెస్ వేసుకొని నిరసనలో పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.

-వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి






వివరాలు 2లో..



2లో..

## ఒక్కరి రక్తదానం.. ముగ్గురికి ప్రాణదానం

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదానం



8లో..

## మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- మడికొండలో అబ్‌స్టేట్రిక్స్, గైనకాలజీ 7వ వార్షిక రాష్ట్ర సదస్సు



8లో..

## హెల్త్ లైన్ డయాగ్నోస్టిక్, ఆర్ఎంపీ క్లినిక్ సీజ్

- నిబంధనలు పాటించకపోవడంతో చర్యలు
- తనిఖీలు నిర్వహించిన డీఎంహెచ్ఓ వెంకటరమణ

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, అక్టోబర్ 26, 2024

# మేమేం తప్పు చేశాం?

- **కుటుంబాలకు దూరంగా కానిస్టేబుళ్లు**
- **కన్నీటిపర్యంతం అవుతున్న కుటుంబ సభ్యులు**
- **ఉధృతమవుతున్న పోలీస్ ఉద్యమం**
- **ఏక్ పోలీస్-ఏక్ స్టేట్ విధానం మరిచారా అంటూ ప్రశ్న**
- **రాష్ట్రంలో తొలిసారి డ్రెస్ వేసుకొని ధర్నా**
- **మా భార్యలతో అలా ఎలా అంటారంటూ నిలదీత**



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఏక్ పోలీస్–ఏక్ స్టేట్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ కానిస్టేబుళ్లు ఆందోళనకు దిగారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ నిరసన కార్యక్రమాల్లో నిన్నటి వరకు కానిస్టేబుళ్ల భార్యలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొనగా శనివారం కానిస్టేబుళ్లే ధర్నాకు దిగారు. రాష్ట్రంలో తొలిసారి డ్రెస్ వేసుకొని పోలీసులు ధర్నాకు దిగడం చర్చనీయాంశంగా మారింది. వరంగల్ జిల్లాలోని మామునూరులో 4వ బెటాలియన్ కానిస్టేబుళ్లు కమాండెంట్ ఆఫీస్ వద్ద బైఠాయించి నిరసన చేపట్టగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు నిరసనకు దిగారు. సాగర్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు.

### ఎందుకీ వివక్ష..

సివిల్, ఏఆర్ పోలీసుల్లాగా కాకుండా బెటాలియన్ కానిస్టేబుళ్లపై ఎందుకు వివక్ష అంటూ కుటుంబ సభ్యులు నిలదీస్తున్నారు. వీరిచేత వెట్టిచాకిరీ చేయిస్తున్నారని మండిపడుతున్నారు. పొద్దున్నే పలుగు, పార ఇచ్చి గడ్డి పీకిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. కనీసం తినేందుకు, పడుకునేందుకు కూడా స్వేచ్ఛ లేదన్నారు. రాష్ట్రంలో సివిల్, ఏఆర్ పోలీసుల మాదిరిగానే బెటాలియన్ పోలీసులకు వారు కోరుకున్న జిల్లాలో కనీసం మూడు నుంచి ఐదు ఏండ్లు ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల పిల్లల చదువులకు అంతరాయం లేకుండా ఉంటుందని, ఉద్యోగభారం తగ్గుతుందని చెబుతున్నారు. గతంలో టీజీఎస్పీ బెటాలియన్లలో పనిచేసే సిబ్బందికి 15 రోజులు డ్యూటీ ఉంటే ఎక్కడో మారుమూల స్టేషన్ నుంచి ఇంటి ప్రయాణానికి ఒకరోజు కేటాయించినా మూడు రోజులు కుటుంబంతో గడిపే అవకాశం ఉండేదని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం 26 రోజులు డ్యూటీ చేసిన తర్వాత నాలుగు రోజులు సెలవు తీసుకోవాలని నిబంధనను కొత్తగా వచ్చిన ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్ తీసుకురావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 13 బెటాలియన్స్..

రాష్ట్రంలో 13 బెటాలియన్స్ ఉన్నాయి. ఒక్కో బెటాలియన్‌లో 1,500 మంది చొ ప్పున సిబ్బంది ఉంటారు. జిల్లా హెడ్‌క్వార్టర్‌లో కచ్చితంగా 200 మంది పహారా నిర్వహిస్తారు. మిగిలిన వారిని ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్, జీ కంపెనీలుగా విభజిస్తారు. ఒక్కో కానిస్టేబుల్ ఆయా బెటాలియన్ పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్‌లో కనీసం మూడు నెలలు డ్యూటీ చేయాల్సి ఉంటుంది. బెటాలియన్ పరిధిలోని అన్ని పీఎస్‌లకు రోటేట్ అవుతుండాలి. దీనిని మార్చేందుకు ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఏక్ పోలీస్–ఏక్ స్టేట్ విధానం ప్రవేశపెడతామంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇచ్చిన హామీని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 26రోజుల డ్యూటీ విధానాన్ని తీసుకురావడం పుండు మీద కారం వేసినట్లుగా మారింది.

### మా భార్యలతో అలా ఎలా అంటారు..

ఏక్ పోలీస్–ఏక్ స్టేట్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసు కానిస్టేబుల్ భార్యలు శుక్రవారం సచివాలయం ముట్టడికి యత్నించారు. వారిని అడ్డుకున్న పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అక్కడ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయితే వారిని పెండ్లి ఎలా చేసుకున్నారంటూ నల్గొండ గ్రామీణ ఎస్ఐ సైదాబాబు అనుచితంగా మాట్లాడడాన్ని కానిస్టేబుళ్లు తప్పుబడుతున్నారు. మా భార్యలతో అలా ఎలా మాట్లాడుతారంటూ మండి పడుతున్నారు. పోలీసుల కుటుంబ సభ్యులపై సైదాబాబు దురుసుగా ప్రవర్తించారని నిరసనకు దిగారు. అక్కడికి వచ్చిన ఎస్సై సైదాబాబు గోబ్యాక్ అంటూ 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు నినాదాలు చేశారు. ఆయనను విధులనుంచి సస్పెండ్ చేయాలంటూ నినదించారు.

### మానవతా ధృక్పదంతో వ్యవహరించాలి..

రిక్రూట్‌మెంట్ విధానంలో ప్రత్యేక బలగాలుగా కొంతమంది ఉద్యోగులను తీసుకుంటారని, బెటాలియన్ల ఉద్యోగాలు చేయడం వల్ల తాము కుటుంబాలకు దూరమవుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏక్ పోలీస్–ఏక్ స్టేట్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అది అమలు అయ్యే వరకు మెస్ తీసివేసి ఒకే దగ్గర మూడు నుంచి ఐదు సంవత్సరాలు పోస్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు మానవతా ధృక్పదంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.








# ఒక్కరి రక్తదానం.. ముగ్గురికి ప్రాణదానం

- **వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
- **పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదానం**

**వరంగల్ వాయిస్, క్రైం :** ఒక్కరు రక్తదానం చేయడం ద్వారా ముగ్గురి ప్రాణాలు కాపాడగలమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాలను పురస్కరించుకోని వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సీపీ శనివారం ప్రారంభించారు. ఏఆర్, ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో ఎంజీఎం రక్తనిధి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిభిరంలో ఏఆర్, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని సీపీ అభినందించారు. వారికి పండ్లు, సర్టిఫికేట్లను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో ఉంటారన్నారు. ముఖ్యంగా పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు సురేష్ కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, ఆర్ఐలు శ్రీధర్, చంద్రశేకర్, శ్రీనివాస్, స్పర్జన్ రాజ్, ఇన్స్ స్పెక్టర్లు సీతారెడ్డి, రామకృష్ణ ,ఆర్ఎస్ఐ శ్రవణ్ కుమార్ ఎంజీఎం రక్తనిధి డాక్టర్ ఆశతో పాటు పోలీస్ యూనిట్ వైద్యులు, ఇతర పోలీసులు, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు బానిస కావద్దు



- **హనుమకొండ జిల్లా డీఆర్వో వైవీ గణేష్**
- **పోలీస్, ఇతర శాఖల అధికారులతో సమీక్ష**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉజ్వల భవిష్యత్తు కలిగిన యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ కోరారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాలులో యువత మత్తు పదార్థాల నియంత్రణపై హనుమకొండ జిల్లా డీఆర్ఓ వైవీ గణేష్, సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, ఇతర శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు కాకుండా ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎదిగే టీనేజ్ పిల్లల పట్ల తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చదువు చెప్పే టీచర్ తమ విద్యార్థి యెక్క ఆలోచన విధానాలు, వారి వ్యవహార శైలి, అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని అధికారుల దృష్టి కి తీసుకొని వెళ్ళి వారిని రి–హాబిలిటేషన్ సెంటర్లకు తరలించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ అదనపు డీసీపీ సలీమా మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల చుట్టు పక్కల అవరణాలల్లో పాన్ షాపు, సిగరెట్ విక్రయ దుకాణాల ఉండకుండా చూడాలని పోలీసు అధికారులు ఆదేశించారు. రద్దీగా, కూడలిలో ఉన్న ప్రతి ఒక్క పాన్ షాపు, సిగరెట్ విక్రయ దుకాణాల పట్ల ప్రత్యేక నిఘా అవసరం అన్నారు. అనుమానాస్పదంగా తిరిగే వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100 , టోల్ ఫ్రీ 1908 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీవో నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఏసీపీలు, నార్కోటిక్స్, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్సు సర్వీసును ప్రారంభించిన ఎమ్మెల్యే




**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల డిపో నుంచి కాలేశ్వరం నుంచి గుంటూరు వరకు వయా పరకాల మీదుగా కొత్త ఆర్టీసీ డీలక్స్ బస్సులను పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ప్రారంభించారు. స్వయంగా ఎమ్మెల్యే పరకాల బస్టాండ్ నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు బస్సును నడిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామన్నారు. కార్మికుల సంక్షేమం, ఆర్టీసీ పరిరక్షణకు, ప్రయాణికుల సౌకర్యానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ఆర్టీసీ కార్మికులపై ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి బస్ సర్వీస్ ప్రారంభించేందుకు కృషి చేస్తానని అన్నారు.

## గ్రామ ప్రజల కష్టాల్లో తోడుంటాను

### మాజీ సర్పంచ్ ఊర రవీందర్రావు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో వార్డులోని పైపులైన్ కూరుకుపోవడం వల్ల తాగునీరు కొరత ఏర్పడడం జరిగింది. ఇది గమనించిన మాజీ సర్పంచి ఊర రవీందర్రావు ప్రజలు ఇబ్బంది పరిస్థితుల దృష్ట్యా ఆఫీసర్ చేతన్ రెడ్డితో మాట్లాడి సీడీఎఫ్ నిధుల నుంచి పైప్ లైన్ వేశారు. ఊర రవీందర్ రావు మాట్లాడుతూ ప్రజల బాగోగులు చూడడానికి పదవే అవసరం లేదన్నారు. ప్రజల ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్న ముందుండి తీరుస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చేతన్ రెడ్డి, కార్యదర్శి సందీప్, మాజీ ఉప సర్పంచ్ కిన్నర మణి, గుడిసెలు రంజిత్, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## శ్మశాన వాటికకు బెంచీల వితరణ




**వరంగల్ వాయిస్, కాటారం :** మండలంలోని గారేపల్లి శ్మశాన వాటిక వద్ద వృద్ధులు కూర్చోవడానికి రెండు బెంచీలను అందజేసి స్థానికులు తమ ఉదారతను చాటుకున్నారు. గారే పల్లికి చెందిన ప్రముఖ వ్యాపారులు తమ తండ్రి జ్ఞాపకార్థం బెంచీలను వితరణ చేసినట్టుగా వారు పేర్కొన్నారు. స్వర్గీయ అనంతుల శేఖ, కముటాల రాజేశంల జ్ఞాపకార్థం వారి కుమారులు అనంతుల శ్రీనివాస్, కముటాల రవీందర్ లు రెండు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. శ్మశాన వాటిక వద్ద వృద్ధులు, చిన్నారులు, ఇతరులు కూర్చోవడానికి అనుకూలంగా ఏర్పాటుచేసిన బెంచీల వల్ల ఎంతో ప్రయోజనం ఉందని, పలువురు సోషల్ మీడియా వేదికగా బెంచీలు అందజేసి ఉదారతను చాటుకున్న దాతలను అభినందించారు.

# అత్యంత క్లిష్టమైన తవి చికిత్స విజయవంతం

### మెడికవర్ హాస్పిటల్ డాక్టర్ల వెల్లడి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** మెరుగైన చికిత్స కోసమంటూ మెట్రో నగరాలకు పరుగు పెట్టవలసిన అవసరం లేదిప్పుడు. మొట్టమొదటి సారిగా వరంగల్ పట్టణంలోనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించటం ద్వారా మెడికవర్ హాస్పిటల్ వైద్య పరంగా నూతన ప్రమాణాలను నిర్దేశించింది. కార్డియాక్ సింకోపితో బాధపడుతున్న 77 సంవత్సరాల వయసు కలిగిన వరంగల్ నివాసికి అత్యంత క్లిష్టమైన తవి శస్త్రచికిత్సను విజయవంతంగా మెడికవర్ వైద్య బృందం చేసింది. అత్యంత క్లిష్టమైన గుండె చికిత్సలను చేయటంలో సుప్రసిద్ధులైన సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజస్ట్ డాక్టర్ ఏ.శరత్ రెడ్డి నేతృత్వంలో మెడికవర్ హాస్పిటల్ వరంగల్ లో ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, సీటీవీఎస్, డాక్టర్ సృజన్ అల్లాడి, అనస్థీషియా డాక్టర్ అవనీష్ ఎస్ బృందం ఈ చికిత్సలో పాలు పంచుకుంది. ఈ చికిత్స క్లిష్టతను మెడికవర్ హాస్పిటల్ లో సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజస్ట్ , క్యాత్ ల్యాబ్, సీటీఓ, కాంప్లెక్స్ కరొనరీ ఇంటర్వెన్షన్స్ డైరెక్టర్ డాక్టర్ ఏ శరత్ రెడ్డి మాట్లాడుతూ "ఈ రోగి అత్యంత క్లిష్టమైన కార్డియాక్ సింకోపితో బాధ పడుతున్నారు. ఆయన గుండె లయ సక్రమంగా లేకపోవటంతో పాటుగా ఆయన గుండె రక్త నాళాలు పూడుకుపోవటం, హార్ట్ వాల్వ్ లో అవరోధాలు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ తరహా సమస్యలు కలిగిన వారికి వాల్వ్ వేయటంతో పాటుగా బైపాస్ కూడా చేయాల్సి ఉంటుంది. అయితే అతని ఆరోగ్య పరిస్థితి కారణంగా తవి, పీటీసీఏలను ఒకేసారి చేశామన్నారు. ఈ తరహా చికిత్సలకు నైపుణ్యం, అత్యాధునిక మౌలిక సదుపాయాలు అవసరమవుతాయి. వరంగల్ లో తొలిసారి విజయవంతంగా ఈ శస్త్రచికిత్స చేయటం సంతోషంగా ఉంది" అని అన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ " గత ఆరు నెలలుగా సింకోపి ఎటాక్ తో రోగి సతమతమవుతున్నారు. పలు హాస్పిటళ్లలో ఆయన చూపించుకోవడం జరిగింది. చివరగా మెడికవర్ కు ఆయన వచ్చారు. రోగి స్థితి చూసి తొలుత 2 డి ఎకో చేశాం. అందులో సివియర్ అయోర్టిక్ స్టెనోసిస్ అని తేలింది. అనంతరం యాంజియోగ్రామ్ చేసిన తర్వాత రోగికి గుండె రక్త నాళాలు, ఇతర సమస్యలు బయటపడ్డాయి. అతనికి సిటీ అంజియోగ్రామ్ ను తవి ప్రోటోకాల్ తో చేయడం జరిగింది. ఈ మినిమల్ ఇన్వాసివ్ ప్రొసీజర్ వల్ల రోగి త్వరగా కోలుకున్నారు. రోగి ఆరోగ్యం నిలకడగా ఉండగా డిశ్చార్జ్ చేశామన్నారు. తదుపరి మూడు ఫాలో అప్ లలో రోగికి ఎలాంటి సమస్యలూ రాలేదు. మొట్టమొదటిసారిగా వరంగల్ లో పీటీసీఏ అండ్ తవి ప్రొసీజర్ ఒకటేసారి మన మెడికవర్ హాస్పిటల్ లో చేయడం జరిగిందని తెలిపారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, సుబేదారి :** ఎంబీబీఎస్ సీట్లను సాధించిన విద్యార్థులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అభినందించారు. ఈ సందర్భంగా శనివారం హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే నివాసంలో ఎంబీబీఎస్ సీట్ల సాధించిన విద్యార్థి విద్యార్థినిలు చింతా చరణ్, బైరాం హర్శిని, సావుల సింధూజలకు వైద్య, విద్య పరికరాలను అందించి వారిని శాలువాతో సత్కరించి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అభినందించారు. అనంతరం విద్యార్థి విద్యార్థినీల తల్లితండ్రులను అభినందించి వారికి ఆర్థిక సాయం అందించారు. ఎంబీబీఎస్ విద్య పూర్తయ్యే వరకు మీకు ఏ అవసరం ఉన్న నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పులి అనిల్ కుమార్, మన్నే బాబురావు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కోటంచ స్వామిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్ దంపతులు



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని కోడవటంచ సుప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని శనివారం ములుగు అడిషనల్ కలెక్టర్ సీహెచ్ మహేందర్ జి కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి సతీ సమేతంగా కుటుంబ సభ్యులకు ఆలయానికి రావడంతో ఆలయ సిబ్బంది అధికార లాంచనాలతో స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలోకి ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆలయంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం పూజారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. వారి దర్శన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట మండల ఆర్ఐ జూపాక నరేష్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రాజు, ఆలయ చైర్మన్ ముల్కనూరు భిక్షపతి, ఆలయ సిబ్బంది గోరంట్ల శ్రావణ్, సొన్నాయిల సుధాకర్, నాగుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

### నిట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రస్తుత సమాజంలో క్రీడలు ప్రతీ ఒక్కరికి అవసరమని ప్రతిష్టాత్మక నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. శనివారం జేఎన్ఎస్ స్టేడియంలో జరుగుతున్న అండర్-19 పోటీలకు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు. ప్రస్తుత ఒత్తిడి ప్రపంచంలో ప్రతీ ఒక్కరు వ్యాయామం చేయాలని సూచించారు. ముఖ్యంగా జూనియర్ కళాశాలల క్రీడాకారులు క్రీడలపై ఎక్కువ దృష్టి సారించాలని తెలిపారు. ఈ ఏజ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఎదగడానికి మంచి అవకాశమని, ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో ఎదిగిన క్రీడాకారులు ఈ వయసు నుంచే కష్టపడి పైకి వచ్చారని సూచించారు. ఇంత పెద్ద ఎత్తున అండర్-19 పోటీలను నిర్వహిస్తున్న ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్ కుమార్ ను అభినందించారు. హనుమకొండ డీవైఎస్ఓ, పోటీల నిర్వాహకులు గుగులోతు అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 29 వరకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. మంచి అహ్లాదకరమైన వాతావరణంలో ఇప్పటివరకు 24 క్రీడాంశాలలో పోటీ నిర్వహించామని అన్నారు. శనివారం జరిగిన వివిధ క్రీడాంశంలో పోటీలకు దాదాపు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యఅతిథి డాక్టర్ రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా క్రీడాకారుల మధ్యలో కేక్ కట్ చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిట్ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ హరి, రమణ, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సృజన్ కుమార్, రవికుమార్, శ్యాం ప్రసాద్, ప్రభాకర్ గౌడ్, కృష్ణారెడ్డి, వివిధ కళాశాలలఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఒక చోట నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో టీజీ జెన్కో సీఎస్ఆర్ నిధులు సుమారు రూ. 2 కోట్లతో చేపట్టే 57 అంగన్వాడీ కేంద్ర భవనాలు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే జీఎస్సాఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న పిల్లల్ని ఇంటి నుంచి బడికి.. బడి నుంచి ఇంటికి చేర్చేలా వాహన సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి కూడా సీఎం త్వరలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విద్యకు వైద్యానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్లు మంచిగా పని చేసి ప్రజల ప్రభుత్వాల మన్నన పొందాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. గాంధీనగరం, గణపురం, సీతారాంపురం, నగరంపల్లి, ధర్మ రావు పేట, పరుశురాంపల్లి, వెంకటేశ్వర్ల పల్లి గ్రామాల్లో అంగన్వాడీ భవనాలను ధర్మరావు పేట, పెద్దాపురం, పరశురాంపల్లి, బసవరాజు పల్లిలో శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్లు పనుల్ని నాణ్యతగా చేయాలని, నాసిరకంగా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.రాజేందర్, ఎండీ చోటేమియా, డి శంకర్, వి. అశోక్, ఎం.రాజయ్య, కుమార్, ఎం.శివ శంకర్, ఎం.మల్లికార్జున్, మీ కృష్ణ, కే. శ్రీనివాస్, జి.సత్తిరెడ్డి, ఎల్.రాములు, ఎన్.రఘుపతి, ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, కేటీపీపీ జెన్కో సీఈ ప్రకాష్, జీపీ ప్రత్యేకాధికారి డీవీఏహెచ్ఓ ఏ. కుమార స్వామి, పంచాయతీ కార్యదర్శి విజేందర్, అంగన్వాడీ సూపర్ వైజర్లు అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఐ రేఖ అశోక్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పోరాట సభను విజయవంతం చేద్దాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 28న కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ తో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరుగబోయే పోరాట సభను విజయవంతం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రంనుండి పిలుపునిచ్చారు. తెలంగాణ కళాకారులను, కళా రూపాలను అవమానపరిచే విధంగా కళలకు సంబంధం లేని వ్యక్తుల విగ్రహాలను అక్కడ ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు. గద్దర్, గూడ అంజన్న, సాయి చంద్ వంటి కళాకారులు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం గళమెత్తారని తెలిపారు. చిందు ఎల్లమ్మ, మిద్దె రాములు, చుక్క సత్తయ్య వంటి వారు తెలంగాణ కళలను దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. అలాంటి కళాకారులను గుర్తించి, గౌరవించి వారి విగ్రహాలను ఏర్పాటుచేసి వారి గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు తెలియజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు దూడపాక నరేష్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, జిల్లా నాయకులు మణితేజ, కుమార్, విజయ్, సంతోష్, మహేందర్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థ ఎన్నికల్లో అవకాశం కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల కులాలకు అవకాశం కల్పించాలని వరంగల్ ఉమ్మడి జిల్లా దొమ్మరి సంఘం గౌరవ అధ్యక్షుడు ముస్కు సుధాకర్ కోరారు. శనివారం హనుమకొండలో వెనుకబడిన బీసీ కులాల సన్నాక సమావేశంలో పాల్గొని వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో దొమ్మరి కులస్తులకు అవకాశం కల్పించాలని, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, రామ్ రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం విడుదల చేసే జాబ్ నోటిఫికేషన్ లో కూడా వెనుకబడిన తరగతుల కులాల విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సాంబయ్య, జిల్లాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రంగనాథ స్వామి ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించడం సరికాదు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ శ్రీ కాశీ విశ్వేశ్వర రంగనాథ స్వామి ఆలయాన్ని ప్రభుత్వం ఎండోమెంట్ దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించడాన్ని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ఇది ప్రభుత్వం దుశ్చర్యగా భావిస్తుంది. ఈ కాశిబుగ్గ ప్రాంతానికి చాలా ప్రాశస్తం ఉంది. ఆలయాన్ని జయేంద్ర సరస్వతి చిన్న జీయర్ స్వామి స్వామి స్వరూపనంద స్వామి గోవిందానంద స్వామీజీ లాంటి మహా మహనీయులు సందర్శించిన ప్రాశస్తం ఉన్న ప్రాంతం ఇది. ఇంతటి విశిష్టమైన ఆలయం కాబట్టే ఇంత మంది ప్రముఖులు రుషులు మహర్షులు లాంటివాళ్ళు సందర్శించే కాశీబుగ్గ ప్రజలకు ఆశీర్వచనం ఇచ్చిపోయారు. ఇలాంటి ఆలయాన్ని రాజకీయాలతో కలుషితం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఈ కాశిబుగ్గ ప్రాంతం మనోభావాలను దెబ్బతీయడం సరికాదని భారతీయ జనతా పార్టీ ఆరోపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం వరంగల్ లోనే కాదు తెలంగాణ ప్రాంతంలో ఏ ఆలయాల్లో జోలికి వెళ్లకూడదని బీజేపీ హెచ్చరిస్తుంది. ఈ కార్యక్రమంలో బాకం హరి శంకర్, కనుకుంట్ల రంజిత్, గడల కుమార్, పైర్ల ఆనంద్, ఎరుకల రఘుణారెడ్డి, కోమాకుల నాగరాజు, పెయిర్ల సజన్, బొడ్డు రాకేష్, మునగాల సతీష్, సిద్దోజ శ్రీనివాస్, బైరి మురళీకృష్ణ, కోట సతీష్, గుర్రపు సత్య నారాయణ, గోవింద్ సింగ్, ముచ్చర్ల ప్రభాకర్, అల్లి అజయ్ కుమార్, సొల్లేటి రాఘవ, పత్రి సుభాష్, కందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## నరకాసుర వధ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 30న ఉర్సు గుట్ట వద్ద జరుగు నరకాసుర వధ ఉత్సవాలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి రావాలని ఆటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. నరకాసుర వధ ఉత్సవ కమిటీ కన్వీనర్ మరుపల్ల రవి ఆధ్వర్యంలో నరకాసుర వధ వాల్ పోస్టర్ ను మంత్రి కొండా సురేఖ రాంనగర్ లోని తన నివాసంలో శనివారం ఆవిష్కరించారు. పురాణంలో జరిగిన సంఘటనలు నేటి తరానికి తెలియజేయడానికి ఇటువంటి ఉత్సవాలు అవసరమని ఆమె అన్నారు. పురాణాల ఆధారంగా చెడుపై మంచి చేసే యుద్ధాన్ని నరకాసుర వధగా మంత్రి కొండా సురేఖ అభివర్ణించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, సహాయ కార్యదర్శి ఆవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్ దూడ కొమురెల్లి, మిర్యాల ఆదిత్య, కుండే రాజు, తౌటం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా ఖరీదైన లేజర్ చికిత్స

### పేద బాలుడి ప్రాణాలు కాపాడిన డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నిరుపేద బాలుడికి ఖరీదైన లేజర్ చికిత్సను ఉచితంగా అందజేసినట్లు హనుమకొండలోని శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్ యూరాలజిస్ట్ డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా జఫర్ గఢ్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన సంధ్య- శివ దంపతుల 14 నెలల బాబు మస్తా సుహాస్ ప్రిన్స్ కు కిడ్నీలో 18 ఎంఎం రాయి ఉందని వైద్యులు నిర్ధారించారు. ఆ రాయిని కిడ్నీకి రంధ్రం కాకుండా చికిత్స చేయాలంటే రూ.3.50 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ విషయంలో నాలుగు ఐదు ఆసుపత్రులు తిరిగి తన వద్దకు వచ్చినట్లు రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. వారి ఆర్థిక పరిస్థితులను చూసి అత్యంత అధునాతనమైన లేజర్ చికిత్సతో రాయిని ఉచితంగా తొలగించినట్లు తెలిపారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడని డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

## బొడ్రాయి వార్షిక మహోత్సవంలో మేయర్ గుండు సుధారాణి పూజలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేట, పాపయ్యపేటలో భూలక్ష్మి, శ్రీలక్ష్మి పోతరాజు సహిత బొడ్రాయి (గ్రామ దేవతల) 7వ వార్షిక మహోత్సవం, బోనాల కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి-ప్రభాకర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రుద్ర శ్రీనివాస్, వడ్నాల నరేందర్, ఆడెపు రవీందర్, చిప్పా వెంకటేశ్వర్లు, లోకేష్, కొప్పుల హరినాథ్, పగడాల వెంకటేశ్వర్లు, గొల్లమడ రాజు, రజిత, ఈటల రాధిక, లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష



**వరంగల్ వాయిస్, మొగిలిచెర్ల :** పరకాల నియోజక వర్గ పరిధి బల్దియా 15వ డివిజన్ మొగిలిచర్ల రైతు వేదిక భవనంలో జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 15, 16, 17 డివిజన్లలో గల అభివృద్ధి పనుల పురోగతి, సమస్యల పరిష్కారంపై శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి స్థానిక శాసన సభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని శానిటేషన్, నీటి సరఫరా, వివిధ ప్రభుత్వ పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వైద్య సేవలు, గుడుంబా, గంజాయి నిర్మూలన, తదితర సమస్యల పురోగతి గురించి మేయర్, ఎమ్మెల్యే సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జి సీపీ రవీందర్ రాడేకర్, హెచ్ఓ రమేష్, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంహెచ్ఓ డా.రాజేష్, తహసీల్దార్ రియాజ్, ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేరిణి నృత్య కళాకారులకు సన్మానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని కొత్తవాడలో అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ ఇంటర్ నేషనల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 192 గవర్నర్ చిప్ప వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గజ్జల రంజిత్ కుమార్, అతడి సతీమణి నవ్యజలను అభినందించి సన్మానించారు. మన తెలంగాణకు సంబంధించిన నృత్యాలను అంతరించి పోకుండా కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ నాట్యం నటరాజ రామకృష్ణ శిష్యుడైన గజ్జల రంజిత్ కుమార్ అంతర్జాతీయ స్థాయిలో తీసుకు వెళుతూ ఎంతోమంది మన్నలను పొందుతున్నారు. వారి ప్రతిభను గుర్తించి అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 192 వరంగల్ తరఫున వారి స్వగృహంలో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో వరంగల్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ కుసుమ లింగమూర్తి, వరంగల్ జిల్లా సౌత్ మల్టిపుల్ కోఆర్డినేటర్ గజ్జల ఓంకార లింగం, క్యాబినెట్ సెక్రటరీ పెంట కుమార్, ప్రెసిడెంట్ దోమల నాగేందర్, జోనల్ చైర్మన్ ఎండీ దస్తగిరీ, రీజనల్ చైర్ పర్సన్ పరికిపండ్ల రాంబాబు, గాదె రాధిక పాల్గొన్నారు.

## గజ్జల రంజిత్ కుమార్‌కు సత్కారం..




రామన్నపేట డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ వారిచే అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని పేరిణి నృత్య కళాకారులు గజ్జల రంజిత్ కుమార్-నవ్యజ దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు. వారితో పాటు శ్రీజ తేజస్విని, పెద్దూరి అమూల్య, కుసుమ చందన, ధరణి, మంజరి, అలేఖ్య, భూమిక, తదితర కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు గజ్జల ఓంకారంగం శాస్త్రి, హైదరాబాద్, సికింద్రాబాద్ ట్రస్ట్ ఇంచార్జి మలిపెద్ది కృష్ణశాస్త్రి, శ్రీరామ్, మల్లేశం, రాచర్ల రాజశాస్త్రి, కుసుమ రామకృష్ణ శాస్త్రి, పెద్దూరి శ్రీనివాస్ స్వామి పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** వెంకటాపూర్ మండల గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులలోను, కావలసిన సదుపాయాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల యువకులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి ఎలాంటి పుస్తకాలు కావాలి, వారికి వసతులు ఎలా ఉన్నాయి. కావలసిన అవసరాల గురించి అడిగి తెలుసుకున్నారు. యువతకు కావలసిన పుస్తకాల వివరాలు సేకరించి వాటిని తొందరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయితీ గ్రంథాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అక్కడ ఏర్పాటు చేయవలసిన భవనాన్ని మంత్రి సీతక్కతో సంప్రదించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి చేపట్టిన బానోత్ రవిచందర్ కు గ్రామ యువత శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రంథాలయానికి కావలసిన సదుపాయాలు తొందరగా ఏర్పాటు చేయాలని రవిచందర్ ను యువత కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ మండల పార్టీ నాయకులు, ములుగు మండలం నాయకులు, ఎన్ఎస్ యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాస్త్ర, సాంకేతిక రంగానికి గణితం ఒక గొప్ప వరం




**వరంగల్ వాయిస్, కేయూ :** శాస్త్ర సాంకేతిక రంగానికి గణితం ఒక గొప్ప వరం అని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అన్నారు. గణిత విభాగ అధిపతి డాక్టర్ భారవి శర్మ ఆధ్వర్యంలో ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణితానికి సంబంధించిన "లీనియర్ ఆల్జీబ్రా, పాక్షిక అవకలన సమీకరణాలు"అను అంశాలపై ప్రత్యేక చర్చ జరిగింది. రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి హాజరై గణితం, సైన్స్ కు, సాంకేతిక రంగానికి దోహదపడుతుందన్నారు. ఎన్ఐటి వరంగల్ రిటైర్డ్ ఆచార్యులు ప్రొఫెసర్ వై ఎన్ రెడ్డి, ప్రొఫెసర్ ఎస్ఎస్ వీఎన్ శర్మ, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సురేష్ లాల్, డీన్ ఆఫ్ సైన్స్ ఆచార్య హనుమంతు, సెమినార్ కన్వీనర్ డాక్టర్ భారవి శర్మ, గణిత విభాగం ఆచార్యులు డాక్టర్ ఎల్పీ రాజకుమార్, డాక్టర్ తిరుమల దేవి, డాక్టర్ సోమయ్య, డాక్టర్ సౌజన్య, నాగయ్య, రవికుమార్, శ్రీలక్ష్మి, మంజుల, వివిధ కళాశాల అధ్యాపకులతో పాటు పరిశోధకులు, విద్యార్థులు హాజరయ్యారు.

# పీడీఎస్‌యూ బహిరంగ సభను జయప్రదం చేయండి




**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం 50వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఈనెల 27న ఖిలా వరంగల్ పడమరకోట జంక్షన్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా పీడీఎస్ యూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సంఘ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బండి కోటేశ్వరరావు కోరారు. ఉదయం 10 గంటలకు ముదిరాజ్ భవన్ లో ప్రతినిధుల సభ జరుగుతుందని, ముందుగా జెండా ఆవిష్కరణ, విద్యార్థి ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించడం జరుగుతుందని, అనంతరం 50 ఏళ్ల పీడీఎస్ యూ చరిత్ర గురించి వక్తలు ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు భోజనం అనంతరం పూర్వ విద్యార్థి నాయకులచే ఐక్యత ఆవశ్యకత తీర్మానం ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. సభ ఆమోదించిన తర్వాత ప్రతినిధుల సభ ముగుస్తుందని వారు ఆయన అన్నారు. సాయంత్రం 5 గంటలకు మెట్టు దర్వాజ నుంచి పడమర కోట జంక్షన్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ ఉంటుందని, 50 ఏళ్ల పీడీఎస్ యూ పోరాటాలకు చిహ్నంగా నూతనంగా నిర్మించిన స్థూపావిష్కరణ ఉంటుందని, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ బహిరంగ సభలో పీడీఎస్ యూ పూర్వ రాష్ట్ర నాయకులు ప్రసంగిస్తారని, అలాగే సామాజిక జనం పాట కళాకారుడు బీకే రాసిన పాటల పుస్తకం ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సభానంతరం సభలో అరుణోదయ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పీడీఎస్ లో పనిచేసిన పూర్వ, ప్రస్తుత విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.సంఘ పూర్వ అధ్యక్షుడు రాచర్ల బాలరాజు, నళిగంటి విజయ పాల్, బైరబోయిన ఐలయ్య, ఇనుముల కృష్ణ, వేణు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక ఉద్యమాలే ఓంకార్‌కు ఘన నివాళి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమ సమాజ స్థాపనకు మార్క్సిజమే ఏకైక మార్గమని, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ అశువులు బాసిన అమరజీవి మద్దికాయల ఓంకార్ కష్టజీవుల ఉద్యమ కెరటమని, వర్గ, సామాజిక పోరాటాల నిర్మాణమే ఆయనకు ఇచ్చే ఘన నివాళులని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ అన్నారు. శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య) వ్యవస్థాపకుడు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి పక్షోత్సవాల సందర్భంగా వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలలో అవినీతి, అక్రమాలు, ప్రలోభాలు రాజ్యమేలుతున్నాయని, నీతి, నిజాయితీ, విలువలు కనుమరుగై ప్రజలకు చెందాల్సిన సంపద పెట్టుబడుదారులు, పాలకులు మమేకమై దోచుకు తింటున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తున్నారని, ఇలాంటి పరిస్థితులలో విలువలతో కూడిన ప్రజా జీవితాన్ని గడిపి కష్టజీవులకు కావలసిన అవసరాలైన భూమి, భుక్తి, ఉపాధి, విద్యా, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించడం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, అసెంబ్లీ టైగర్ కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ అని కొనియాడారు. ఆయన జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని, ఓంకార్ ఆదర్శాలను, ఆశయాలను పుణికి పుచ్చుకొని దోపిడిదారులైన పెట్టుబడిదారులకు, భూస్వాములకు వారికి అండగా నిలిచే పాలకులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నగర నాయకులు ఐతం నాగేష్, మాలి ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, నలవెల రవి, మల్లికార్జున్ గోవర్ధన్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ, వరంగల్ జిల్లా వార్త కార్యాలయ ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, సుబేదారి :** హనుమకొండ సుబేదారిలోని సర్క్యూట్ హౌస్ రోడ్ విశాల్ భవన్ పక్కన వార్త హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యాలయాన్ని శనివారం ఉదయం వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఆర్ఎం ఏవీ రత్నం చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వార్త బ్యూరో ఇంచార్జిలు, ఆర్సీ ఇంచార్జీలతో పాటు వివిధ మండలాల నుంచి పాత్రికేయ మిత్రులు, వార్త కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తెలుగు జాతీయ దినపత్రికగా వార్తాపత్రిక తన సేవలను అందిస్తుందని, అలాగే తన సేవలను అందిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పేరుపొందాలని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, వరంగల్ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, వార్త హనుమకొండ బ్యూరో ఇంచార్జి వేణు ప్రసాద్, వివిధ పత్రికల అధినేతలు, పాత్రికేయ మిత్రులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



## వరంగల్ ఇంటిగ్రేట్ మార్కెట్ పెండింగ్ పనులను పూర్తి చేయాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** పన్నెండు లక్షల జనాభా గల వరంగల్ మహానగరంలో లక్ష్మీపురం పండ్ల కూరగాయలు అమ్మకం, కొనుగోలు మార్కెట్ గత 50-60 సంవత్సరాల నుంచి తగిన సౌకర్యాలు లేకుండా నిర్లక్ష్యానికి గురై ఎదుగు బోదుగు లేకుండా ఉందని, ప్రత్యేక రాష్ట్రం సాధించినప్పటికీ అతి గతి లేదని తెలంగాణ రైతు సంఘం సలహాదారు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అభిప్రాయపడ్డారు. శనివారం వరంగల్ లో అబ్బని కుంట తెలంగాణ రైతు సంఘం భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన కూరపాటి వెంకట్ నారాయణతో పాటు రైతు సంఘం అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, సంఘ నాయకులు సోమ రామమూర్తి పాల్గొని మాట్లాడారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, పోయినా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా తర్వాత కూడా లక్ష్మీపురం మార్కెట్ పరిస్థితి ఎక్కడి గొంగళి అక్కడే ఉన్నట్లు ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, నగర మేయర్, మున్సిపాలిటీ కమిషనర్, ఇతర నాయకులు చొరవ తీసుకొని తగిన నిధులను సమకూర్చి ఈ సమస్యను కాలయాపన చేయకుండా పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం కోరుతోంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఊరటి అంశాల్ రెడ్డి, ఏఐకేఎఫ్ జిల్లా నాయకుడు అయితం నాగేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు ఎల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

### సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

### రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జమిలి ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం భారత సమాఖ్య విధానానికి విరుద్ధమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాస రావు మాట్లాడుతూ బీజేపీ నోట జమిలి ఎన్నికల మాట వినబడుతున్నదని, కేవలం పెట్టుబడిదారుల కోసమే జమిలి ఎన్నికలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. జమిలి ఎన్నికలు మన దేశంలో సాధ్యం కాదని, అది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నారు. రాష్ట్రాల హక్కులను పూర్తిగా అణిచివేసేందుకే జమిలి ఎన్నికల పాట అందుకున్నారని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, వాటి నుంచి, ప్రజల దృష్టిని మరల్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు. కార్పొరేట్ వ్యవస్థ రోజు రోజుకు విస్తరించడం వల్లనే నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాల్లోకి అడిగిడుతున్న సందర్భంగా సీపీఐ శత దినోత్సవ వేడుకలను సంవత్సరం పాటు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా పార్టీని గ్రామ గ్రామానికి విస్తరించాలని, వాడవాడలా శత సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. పేదవాడికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇండ్లు నిర్మించే వరకు భూ పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టి ప్రజా సమస్యలను పరిష్కారం దిశగా పయనించాలని, ప్రతి ఒక్కరికీ విద్యా, వైద్యం,ఉపాధి కోసం ఉద్యమించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు ఊట్కూరు రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, భాషబోయిన సంతోష్, నకిర్తె ఓదెలు, జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, శంకర్ నాయక్, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, రాసమల్ల దీన, కె.వెంకటరమణ, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, కండె నరసయ్య, మర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టైక్వాండో పోటీల్లో సింధుకు బంగారు పతకం



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ఈ నెల 25న వరంగల్ లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి టైక్వాండో అండర్-14 పోటీల్లో మహబూబాబాద్ జిల్లాఎల్లంపేట గ్రామానికి చెందిన పున్నెపుర్తి సింధు (9వ తరగతి) టైక్వాండో ఎస్ జీఎఫ్ అండర్-14 పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ నెల 26, 27, 28న వికారాబాద్ జిల్లాలోని తేజ ఫంక్షన్ హాల్ లో జరగబోవు ఎస్ జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొంటున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.భాస్కర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, క్రీడాకారులు సింధును అభినందించారు. టైక్వాండోలో సింధు రాణించడానికి శిక్షణను ఇచ్చిన టైక్వాండో కోచ్ కల్లేపల్లి రమేష్ ను అభినందించారు.

## వార్డు అధికారిపై దాడి హేయమైన చర్య



**వరంగల్ వాయిస్, పరకాల :** వనపర్తి జిల్లా కొత్త కోట మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ అధికారిపై చైర్ పర్సన్ భర్త దాడి చేసిన సంఘటనకు నిరసనగా హనుమకొండ జిల్లా పరకాల పట్టణానికి చెందిన వార్డు అధికారులు పరకాల మున్సిపల్ కార్యాలయంలో ఆర్వో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు అధికారులు మాట్లాడుతూ నిత్యం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న అధికారులపై దాడిని ఖండిస్తూ తమ హక్కులకు భంగం కలిగే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. దాడి చేసిన చైర్ పర్సన్ భర్త వార్డు అధికారులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు శిరీష, రాధిక శోభా, వనిత, వేణు, కుమార్, రవి, మొగిలి, రమాదేవి పాల్గొన్నారు.

## వైఎంసీఏ సేవా భావం గొప్పది



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** వైఎంసీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల 10 వతరగతి 2023-24 మొదటి, రెండు గ్రేడ్ విద్యార్థులకు .శనివారం నగదు ప్రోత్సహకం పంపిణీ చేశారు. వైఎంసీఏ కార్యదర్శి బొడ్డు సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎంసీఏ సేవా భావం గొప్పదని, భారతదేశం లో మొట్టమొదటి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల తమిళనాడులో స్థాపించి, ఎంతోమంది క్రీడాకారులను తయారుచేసి భారతదేశం తరుపున పాల్గొనుటకు ప్రోత్సహించిందన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదివి దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. మంచి సేవాభావం కలిగి తల్లిదండ్రుల కోరిక తీర్చాలని, దేశాభివృద్ధి విద్యార్థులైన మీపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విధ్యాధికారి వి.వెంకటేశ్వర్లు, పాఠశాల ఇంచార్జి హెచ్ఎం జి.సంజీవ, వైఎంసీఏ మెంబర్స్ రెవరెండ్, అనుదీప్, ట్రెజరర్ బొడ్డు శశికర్, శకుంతల, కె.సతీష్, బి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మహాదేవపూర్ నగర కార్యదర్శి పేట సాయి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయని కారణంగా దాదాపు రూ.7,500 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నిర్లక్ష్యం పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారిందని దుయ్యబట్టారు. ఫీజురీయింబర్స్ మెంట్ పై ఆధారపడి నడిపిస్తున్న కళాశాలలు వందల సంఖ్యలో ఉన్నాయని, మధ్యలోనే కళాశాల యాజమాన్యాలు చేతులెత్తే పరిస్థితి కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటు యాజమాన్యానికి అటు ప్రభుత్వానికి మధ్యలో బలవుతున్నది విద్యార్థులేనన్నారు. రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ విడుదల చేయని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, అజయ్, అరుణ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## రైతులను మోసం చేస్తున్న సీఎం



**వరంగల్ వాయిస్, గణపురం :** రాష్ట్ర రైతులకు రుణమాఫీ రైతు భరోసా పంటలకు రూ.500 బోనస్ ఇవ్వక సీఎం రేవంత్ రెడ్డి, పుట్టక వాగ్దాన చక్రవర్తిగా పేర్చుకున్నాడని, గణపురం మాజీ సొసైటీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్ర రెడ్డి అన్నారు. శనివారం ఆయన గణపురంలో విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ కొంతమందికే చేసి అందరికి చేసినట్లు డబ్బాలు కొట్టు కుంటున్నాడని, అదే రెండు పంటల నుంచి రైతు భరోసా ఇవ్వలేదని, వడ్లకు రూ.500 బోనస్ ఇస్తానని చెప్పి ఇప్పుడు సన్నధాన్యం మాత్రమే ఇస్తానని, సీఎం చెప్పడం రైతులను దగా చేసినట్లేనని పూర్ణ చంద్రారెడ్డి విమర్శించారు.

# అనాదిగా ఆదివాసీ ఎరుకల జాతికి తీవ్ర అన్యాయం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రాజ్యాంగం అమలైన నాటి నుంచి నేటి వరకు అన్యాయానికి గురైన జాతి ఆదివాసి ఎరుకల జాతి అని రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అన్నారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కేతిరి రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం ఎరుకల హక్కుల సాధనకు నిరసన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు పాల్గొని వరంగల్ కాశిబుగ్గలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 8 లక్షల జనాభా కలిగి ఉండి విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం అమలైన రోజు నుంచి నేటి వరకు ఎరకల జాతికి అన్యాయం జరుగుతూనే ఉందని ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఇతర గిరిజనులకు అందినట్టుగా రాజ్యాంగ ఫలాలు ఆదివాసీ ఎరుకల జాతికి అందడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం తరఫున ఎన్నో సంవత్సరాలుగా ఎరుకల హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు చేసినప్పటికి ప్రభుత్వాలు పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ అవకాశాలతో పాటు జనాభా ప్రతిపాదిక మీద మా వాటా మాకు రావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాజిక దృక్పథంతో ఆలోచించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి ఎరుకల జాతిని గుర్తించి తమ డిమాండ్లను అమలు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఆదివాసీ ఎరుకల సమగ్ర అభివృద్ధి కోసం ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల బడ్జెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణలత భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓని సదానందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొండ ప్రభాకర్, హనుమకొండ మండల అధ్యక్షుడు పులిసేరు సారయ్య, దుఖ్యాల రాము, పల్లకొండ హరిబాబు, పులిచేరు వేణు, ఓనీ సురేష్, రాయపురం సాంబశివ, పల్లకొండ భిక్షపతి, పులి చేర్ సురేష్, పులిచేరు సారంగం, పల్లకొండ వినోద్, గోపి, కంప శ్రీను, పల్లకొండ వంశీ, మానుపాటి కృష్ణ, పల్లగొండ పోషాలు, పల్లగొండ రాజేందర్, దేవర నవీన్ తదితరులు పాల్గొన్నారు.




## ధర్మ యుద్ధ మహాసభకు మాదిగ జాక్ నాయకులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని అన్ని గ్రామాల నుండి పార్టీలకు అతీతంగా మాదిగ, మాదిగ ఉపకులాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్మ యుద్ధ మహాసభకు భారీ ఎత్తున తరలి వెళ్లారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వరంగల్ హంటర్ రోడ్డులోని డి కన్వెన్షన్ హాల్ లో జరుగు మీటింగ్ కు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాదిగ, తదితర ప్రముఖులు మాట్లాడారు. కార్యక్రమంలో జంగిలి బాబు, వంగాల రవీందర్, జిల్లా ధర్మయ్య, చిన్నపాక శ్రీనివాస్, వల్లందాస్ వెంకన్న, జిల్లా శ్రీనివాస్, తాటికాల నరసయ్య, బోట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

# నా బాడీ, నా ఇష్టం..



**బాడీ షేమింగ్‌పై మండిపడ్డ అలియాభట్**


బాడీ షేమింగ్ ఫిల్మ్ ఇండస్ట్రీకి కొత్తేమీ కాదు. తరచూ ఎవరో ఒకరి మీద బాడీ షేమింగ్ కామెంట్స్ వస్తూనే ఉంటాయి. తాజాగా బాలీవుడ్ క్యూటీ ఆలియాభట్ ఈ సమస్యను ఎదుర్కొంటోంది. ఆమెకు కాస్మొటిక్ సర్జరీ ఫెయిల్ అయిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ మధ్యన ఆమె నవ్వితే మూతి వంకర పోతుందని కొన్ని కామెంట్లు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. ఆమె మాట్లాడుతున్నప్పుడు కూడా ముఖం తేడాగా కనిపిస్తోందని కొంతమంది విమర్శలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో తనను ట్రోల్ చేస్తున్న వారిపై ఆలియా మండిపడ్డారు. తన లుక్స్ గురించి కామెంట్ చేస్తున్న వారి కోసం ఆలియా ఓ పోస్ట్ పెట్టింది. ''కాస్మెటిక్ కరెక్షన్ లేదా సర్జరీ చేయించుకునే ఎవరి గురించి మాట్లాడను, జడ్జ్ చేయను. మీ శరీరం, మీ ఇష్టం. కానీ దీనిపై నడుస్తున్న ట్రోలింగ్ హాస్యాస్పదంగా ఉంది. నేను చేయించుకున్న బొటాక్స్ ఫెయిల్ అయిందంటూ వీడియోలు వైరల్ అవుతున్నాయి. మీ అభిప్రాయం ప్రకారం, నేను వంకరగా నవ్వుతాను, మాట్లాడినప్పుడు వింతగా ఉంటాను. నా ముఖం ఒకవైపు పక్షవాతానికి గురైందని మాట్లాడుతున్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఇలాంటి వీడియోలు ఎలా చేస్తారు. ఇలాంటి కామెంట్స్ చేసేటప్పుడు దానికి వెనక ఏముంది. అసలేం జరిగింది అన్నది తెలుసుకోరా? ప్రతి వ్యక్తికి కొన్ని ఇష్టాలు, నిర్ణయాలు, సొంత ఛాయిస్‌లు ఉంటాయి. వాళ్లకు నచ్చినట్లు జీవితాన్ని సాగిస్తుంటారు. వాళ్ల వ్యక్తిగత జీవితంలోకి వెళ్లి భూతద్దం పెట్టి చూడటం 100 శాతం తప్పే. ఇతరుల వ్యక్తిగత జీవితాల గురించి మీకు ఎందుకు? అంటూ మండిపడిరది. తాజాగా ఆమె నటించిన 'జిగ్రా' చిత్రం విడుదలైంది.

# నా కెరీర్‌లో బిగ్ ప్రాజెక్టు



విరూపాక్ష వంటి బ్లాక్ బస్టర్ చిత్రం తర్వాత మెగా సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ నటిస్తోన్న కొత్త చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. రోహిత్ కెపి దర్శకత్వం వహిస్తోన్న ఈ సినిమాను హనుమాన్ వంటి భారీ చిత్రాన్ని అందించిన నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా.. ప్రపంచ రికార్డులను బద్దలుకొట్టిన ఓ హాలీవుడ్ సినిమా రీమేక్ అని తెలుస్తోంది. ఇంతకీ ఆ మూవీ ఏంటి.. తేజ్ ఏమన్నాడంటే.. ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు 'జాక్ సిందర్' దర్శకత్వం వహించిన సినిమా '300'. యుద్ధం నేపథ్యంలో యుద్ధవీరుల సాహసాల కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమా ప్రపంచ సినిమా చరిత్రలో సరికొత్త అధ్యాయం. 2006లో రిలీజైన ఈ సినిమాని ఇండియాలోని అన్ని భాషల్లో ఫ్రీమేక్ చేశారు. తాజాగా తెరకెక్కనున్న సాయి ధరమ్ తేజ్ సినిమా కూడా అదే అని వార్తల్లొచ్చాయి. దీనిపై హీరో తేజ్ స్పందిస్తూ.. 300 సినిమా నుండి ఇన్‌స్పైర్ చెందే ఈ సినిమాని రూపొందిస్తున్నామన్నారు. తేజ్ కెరీర్‌లోనే ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాని 120–130 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లు సమాచారం.

# ఆ మూవీస్ రికార్డులు బద్దలవుతాయి



**పుష్ప.2పై డిస్ట్రిబ్యూటర్ వ్యాఖ్యలపై కన్నడీలు ఫైర్**

'పుష్ప 2' చిత్రం విడుదల గురించి ఇటీవల హైదరాబాద్‌లో నిర్మాతలు డిస్ట్రిబ్యూటర్స్‌తో కలిసి ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వేదికపై కన్నడ డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కన్నడనాట వివాదానికి గురి చేసింది. 'పుష్ప 2 చిత్రాన్ని కేజీఎఫ్, కాంతార రికార్డులు బద్దలయ్యే స్థాయిలో విడుదల చేస్తామని, మార్నింగ్ షోలను ప్లాన్ చేస్తామని వెల్లడిరచారు. అయితే ఇప్పుడు ఆ మాటే కన్నడిగులకు మండేలా చేసినట్లయింది. తమ రెండు బ్లాక్ బస్టర్ సినిమాలను దాటుతామని చెప్పడంతో కన్నడ సినీ అభిమానులు సోషల్ మీడియాలో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇతర సినిమాల ఆధిపత్యం మీద అక్కడి నిర్మాతలు కొందరు చాలాకాలంగా గుర్రుగా ఉన్నారు. తెలుగు చిత్రాలైన బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, సలార్ టైంలో వాటికి ఎక్కువ స్క్రీన్లు ఇచ్చి తమకు అన్యాయం చేస్తున్నారంటూ విమర్శలు కూడా చేశారు. అలాగే ఎప్పటి నుంచో డబ్బింగ్ సినిమాల విడుదలను అడ్డుకుంటు వస్తున్నారు. ఇతర భాషా చిత్రాలను కట్టడి చేయాలనే డిమాండ్ అక్కడ కొంత కాలంగా ఉంది. ఈ క్రమంలో తాజాగా పుష్ప 2 కన్నడ డిస్ట్రిబ్యూటర్ లక్ష్మీకాంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అగ్గి రాజేసినట్లయింది. నిజానికి డిసెంబర్ మొదటివారంలో పుష్ప 2 మినహా చెప్పుకోదగ్గ కన్నడ సినిమాలేవీ రిలీజ్ లేవు. కానీ కన్నట నాట వారి భాషకు సంబంధించి అక్కడి ప్రజలు పలు సంఘాలు చాలా పర్టిక్యూలర్‌గా ఉంటున్నాయి. కన్నడిగుల కోపం పుష్ప–2పై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో మరి. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రానుంది.

**ప్రపంచవ్యాప్తంగా 11,500 స్క్రీన్స్‌లో పుష్ప2**

ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రపంచవ్యాప్తంగా ఆరు భాషల్లో 11,500 స్క్రీన్స్ లో దీన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు భారీగా ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. ఇండియాలో 6,500.. ఓవర్సీస్‌లో 5000 స్క్రీన్స్ లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇప్పటివరకు ఏ ఇండియన్ సినిమా ఈ స్థాయిలో విడుదల కాలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ సినిమాగా 'పుష్ప 2' రికార్డు సృష్టించనుండడం ఖాయమేనని అంటున్నారు. ఈ చిత్రం కలెక్షన్లలోనూ సరికొత్త రికార్డులు తన ఖాతాలో వేసుకుంటుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. దీంతో ఫ్యాన్ ఆనందంలో మునిగి తేలుతున్నారు.

# విడాకులు తీసుకున్న వ్యక్తితో ..

**ఆ ఫొటోలు షూటింగ్‌లో భాగమే**



తమిళనాడులో జయం రవికి మంచి క్రేజ్ ఉంది. జయం రవి నుంచి సినిమా వస్తుందంటే మినిమమ్ గ్యారెంటీ ఉంటుందనే విధంగా ఆయన పేరు సంపాదించుకున్నారు. అయితే జయం రవి వైవాహిక జీవితం గురించి గత కొద్ది రోజులుగా అనేక రూమర్స్ వైరల్ అయ్యాయి. జయం రవి ఆర్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ జంటకు ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. అయితే వీరిద్దరి మధ్య అభిప్రాయభేదాలు రావడంతో విడిపోవాలని చూస్తున్నారని,విడాకుల కోసం కోర్టును కూడా ఆశ్రయించినట్లు పుకార్లు వచ్చాయి. ఈ పుకార్లను నిజం చేస్తూ ఈ జంట విడాకులు తీసుకున్నారు. అధికారికంగా తాము విడిపోతున్నట్టు జయం రవి తెలిపారు. అయితే విడాకుల గురించి తనని సంప్రదించకుండానే ప్రకటించారని జయం రవి భార్య ఆర్తి ఆవేదన వ్యక్తం చేసింది. జయం రవి ఆర్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే భార్య నుంచి విడాకులు తీసుకుని పది రోజులు కూడా కాకుండానే జయం రవి మరో అమ్మాయితో క్లోజ్‌గా మూవ్ అవుతూ కనిపించారు. ''పెళ్లాం పోర్న్ టార్చర్.. రోజుకు 3 సార్లు నావల్ల కాదంటూ కోర్టుకెళ్లిన భర్త.. చివరికి!'' జయం రవి కేనిషా ఫ్రాన్సిస్ అనే సింగర్‌తో రిలేషన్‌లో ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. వీరిద్దరు డేటింగ్ చేస్తున్నారని రూమర్స్ తెర మీదకు వస్తున్నాయి. సరిగ్గా ఇదే సమయంలో జయం రవి, హీరోయిన్ ప్రియాంక మోహన్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు పెళ్లి దుస్తుల్లో కనిపించారు. దీంతో జయం రవి , ప్రియాంక మోహన్ ఎంగేజ్‌మెంట్ చేసుకున్నట్టు ప్రచారం జరిగింది.

విడాకులు తీసుకున్న అతను తప్ప పెళ్లి చేసుకోవడానికి వేరే వ్యక్తి దొరకలేదా? అంటూ నెటిజన్లు ప్రియాంక మోహన్‌పై మండిపడ్డారు. జయం రవితో పెళ్లి వార్తలపై ప్రియాంక మోహన్ స్పందించారు. జయం రవి, నేను 'బ్రదర్' అనే సినిమాలో నటిస్తున్నాము. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఈవెంట్ పెట్టి చిత్రబృందం మా ఇద్దరికి సంబంధించిన ఒక ఫొటో విడుదల చేశారు. అందులో మేమిద్దరం మెడలో పూల దండలు వేసుకుని ఉన్నాము. దీన్ని అందరు తప్పుగా అర్థం చేసుకున్నారని దీనిపై ప్రియాంక మోహన్ వివరణ ఇచ్చింది.



# మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

- వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య
- మడికొండలో అబస్టేట్రిక్స్, గైనకాలజీ 7వ వార్షిక రాష్ట్ర సదస్సు

**వరంగల్ వాయిస్, హన్మకొండ :** వరంగల్ వేదికగా మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ లో జరిగిన అబస్టేట్రిక్స్, గైనకాలజీ తెలంగాణ చాప్టర్ 7వ వార్షిక రాష్ట్ర సదస్సులో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2వేల మంది గైనకాలజిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఎక్కువ శాతం గైనకాలంజస్ట్ లు మహిళలే అయినందున మహిళల మానసిక, ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. మహిళలకు వివిధ దశలలో వచ్చే అనారోగ్య సమస్యలను వారికీ అర్థం అయ్యే విధంగా వివరించాలన్నారు. కౌమార దశ నుంచి గర్భిణులు, మోనోపాజ్, క్యాన్సర్, వయో వృద్దులు ఎదుర్కొనే సమస్యల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. రక్త హీనంత, పౌష్టిక ఆహారలోపం వంటి వాటితో పాటు క్యాన్సర్ స్క్రినింగ్ టెస్ట్ లు చేయాలని సూచించారు. కోవిడ్ తర్వాత డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలతో సతమతమౌతున్నారని కావున మానసిక సమస్యలు, మెంటల్ హెల్త్ పై కూడా దృష్టి సారించాలని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రీసెర్చ్, పరిశోధనలు చేయడానికి అధిక నిధులు కేటాయించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఆధునిక శస్త్ర చికిత్సలు, వ్యాధులపై పరిశోధనలు జరిపే విధంగా కూడా తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా సాధికారత అంటే కేవలం ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యంగా కూడా బలంగా ఉన్నప్పుడే నిజమైన సాధికారత సాధించినట్లు అవుతుందని తెలిపారు. ఇంత మంచి సమావేశాన్ని వరంగల్ వేదికగా నిర్వహించినందుకు ప్రత్యేక అభినదనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళోజి హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కర్ణాకర్ రెడ్డి, డాక్టర్ శాంత కుమారి, డాక్టర్ జాముున దేవి, డాక్టర్ నరసింహ రెడ్డి, డాక్టర్ సంధ్యా రాణి, డాక్టర్ మధు చంద్ర, ఇతర గైనకాలంజస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

# హెల్త్ లైన్ డయాగ్నొస్టిక్, ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శివనగర్ లోని హెల్త్ లైన్ డయాగ్నొస్టిక్ సెంటర్ తోపాటు ఫోర్ట్ వరంగల్ లోని ఆర్ఎంపీ క్లినిక్ ను జిల్లా ఆరోగ్య శాఖ అధికారి కాజీపేట వెంకటరమణ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. అనీస అర్హతలు లేకుండా రిజిస్ట్రేషన్ సైతం చేయించుకోకుండా అక్రమంగా నిర్వహిస్తున్న హెల్త్ లైన్ డయాగ్నొస్టిక్ సెంటర్, ఆర్ఎంపీ క్లినిక్ లను డీఎంహెచ్ఓ శనివారం తన బృందంలో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వారు నిర్వహిస్తున్న పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్ లు, పోలీక్లినిక్ లు నడిపే వారు తప్పనిసరిగా మెడికల్ నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. వారు తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకూడదన్నారు. వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలనీ ఇంజెక్షన్లు, సెలైన్ లు పెట్టడం నిషేదమన్నారు. విదేశాలలో వైద్య విద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా ఎఫ్ఎంజీఈ టెస్టులో ఉతీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్న తర్వాతే హాస్పిటల్స్ లో వైద్యం చేయాలన్నారు. జిల్లాలో తనికీ బృందాలు నిరంతరం క్లినిక్ లు, ఆస్పత్రులు తనిఖీ చేస్తుంటాయన్నారు. తనిఖీ అధికారులు అడిగిన వెంటనే అన్ని రకాల అనుమతులకు సంబందించిన సర్టిఫికెట్లు, సిబ్బంది వివరములు, ధరల పట్టిక చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ ,డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎస్ఓ విజయలక్ష్మి, ఎల్ డి కంప్యూటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# ముగ్గురు దొంగల అరెస్ట్

- రూ.1.58 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి

**వరంగల్ వాయిస్, క్రైం : వరంగల్ వాయిస్, సుబేదారి :** యజమానిని ఏమార్చి బంగారం ఆభరణాలు దోపిడీకి ప్లాన్ వేసిన డ్రైవర్ తో సహా ముగ్గురిని సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరినుంచి రూ.1.58 లక్షల నగదు, రోల్డ్ గోల్డ్ ఉంగరం, గొలుసు, మూడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ కు సంబంధించి హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితుడైన బైరి రాము కీర్తి రవీందర్ కారు డ్రైవర్ గా చేరాడు. అప్పటినుంచి యజమాని ఒంటి మీద ఉన్న బంగారం ఆభరణాలపై కన్ను వేశాడు. ఇందుకోసం తన మిత్రులైన రావుల అరుణ్ కుమార్, ఓర్సు గణేష్ తో కలిసి ప్లాన్ వేశాడు. అందులో భాగంగానే ఈ నెల 13వ తేదిన కీర్తి రవీందర్ తన డ్రైవర్ బైరి రాముతో కలిసి శాయంపేట చెరువు కట్టపై ప్రయానిస్తున్న సమయంలో ఇద్దరు మిత్రులు కారును ఆపగా ముగ్గురు కలిసి కీర్తి రవీందర్ ను చితక బాది అతడి ఒంటిపై ఉన్న 31 గ్రాముల బంగారం,సెల్ ఫోన్ ను దోపిడీ చేయడంతో బాటు ఎవరికి అనుమానం రాకుండా దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులు కారు డ్రైవర్ అయిన ప్రధాన నిందితుడి ఒంటి మీద ఉన్న రోల్డ్ గోల్డ్ నగలు కూడా దోచుకున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సుబేదారి పోలీసులు వారికి అందుబాటులో ఉన్న పరిజ్ఞానంను వినియోగించుకొని కారు డ్రైవరే ప్రధాన నిందితుడిగా గుర్తించి అతనిని అరెస్ట్ చేసి విచారణ చేయగా నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో పాటు ఇతడు ఇచ్చిన సమాచారం మేరకు మిగితా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లుగా ఏసీపీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన ఎస్సై ఫణి, కానిస్టేబుల్లు ప్రభాకర్, లియాఖత్ ఆలీ, సత్యనారాయణ, రఘు లను హనుమకొండ ఏసీపీ కె.దేవేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# చాంబర్ అధ్యక్షుడితో కలెక్టర్ భేటీ

## పత్తి కొనుగోలులో ఎదురవుతున్న సమస్యలపై ఆరా



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డితో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి శనివారం కలెక్టర్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ లో రోజువారి నిర్వహించే రైతు సరుకుల కొనుగోలులో ఎదురవుతున్న సమస్యలతోపాటు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న పత్తి విషయంలో శుక్రవారం జరిగిన సంఘటన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో ఈ మధ్య కురిసిన అధిక వర్షాలతో పత్తిలో తేమ 15 నుంచి 25 శాతానికి పెరిగిందని బొమ్మినేని రవీందర్ రెడ్డి తెలిపారు. కానీ మద్దతు ధరతో పత్తి కొనుగోలుకు సీసీఐ 12 శాతం తేమ నియమము ఉన్నందున సీసీఐ పత్తి కొనుగోలు చేయలేని పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. దీనిపై తెలంగాణ రాష్ట్ర పత్తి రైతుల మేలుకోరి తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు, కేంద్ర జౌళి శాఖ మంత్రికి సీసీఐ 12 శాతం తేమ నియమాలను సడలించి పత్తి కొనుగోలు చేయాలని వారికి లేఖ ద్వారా అభ్యర్థించడం జరిగిందన్నారు. కానీ ఈ విషయంలో తల దూర్చి కొన్ని స్వార్థపర శక్తులు రైతులలో వ్యాపారులపై అపోహలు సృష్టించి అసంతృప్తిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి శక్తులను నిరోధించకుంటే వ్యవసాయ మార్కెట్లో వ్యాపారాలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలియజేసినారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ మార్కెట్ అధికారులతో చర్చించి అలాంటి స్వార్థపర శక్తులతో జాగ్రత్తగా ఉండాలని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇట్టి సమావేశమునకు వరంగల్ జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు చింతలపల్లి వీరా రావు, ఉపాధ్యక్షులు నాగమల్ల ఓంకారేశ్వర్, పింగిలి మల్లారెడ్డి, కోశాధికారి గోపిశెట్టి వేణుగోపాల్, చాంబర్ కోశాధికారి అల్లే సంపత్, వ్యవసాయ మార్కెట్ అధికారులు, డీడీఎం, డీఎంఓ, ఉన్నతశ్రేణి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# మినీ మేడారం జాతర తేదీల ఖరారు

- ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జాతర నిర్వహణ
- వెల్లడించిన పూజారులు

**వరంగల్ వాయిస్, ములుగు :** ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క–సారక్క జాతర. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో గిరిజన సంప్రదాయ పద్దతిలో ఈ జాతర రెండేళ్లకు ఒకసారి నిర్వహించడం ఆనవాయితీ. గత సంవత్సరం మేడారం జాతర జరిగినందున ఈ ఏడు మినీ మేడారం జాతరను నిర్వహించేందుకు పూజారులు నిర్వహించారు. మినీ మేడారం జాతరకు సైతం భక్తులు అధిక సంఖ్యలో హాజరై వన దేవతలు సమ్మక్క – సారక్కలను దర్శనం చేసుకొని అమ్మవార్లకు మొక్కలు చెల్లిస్తారు. ఈ క్రమంలో శనివారం మేడారం గ్రామంలో సమ్మక్క – సారక్క, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారుల సమక్షంలో మినీ మేడారం జాతర తేదీలను ఖరారు చేశారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మినీ మేడారం జాతర నిర్వహించనున్నట్లు మేడారం పూజారులు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మినీ మేడారం జాతరను విజవంతం చేయాలని కోరారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com